క్లుప్తంగా

శంషాబాద్‌లో పోలీసుల కవాతు

శంషాబాద్: ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో పోలీసుల కవాతు నిర్వహించారు. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు పెద్దఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. పట్టణంలోని సిద్దప్పరోడ్డు, ఆర్బీనగర్, మధురానగర్, అహ్మద్‌నగర్ తదితర బస్తీల గుండా పోలీసులు పెద్ద ఎత్తున కవాతు చేపట్టారు.

పశువులకు టీపీఆర్ నిరోధక టీకాలు

పశువైద్య అధికారి దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో నల్లమబ్బు, మూర్చ వ్యాధి రాకుండా టీకాలు వేయనున్నట్లు అమ్డాపూర్ పశువైద్య అధికారి దేవీరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు ఈ టీకాలు వేస్తారని సూచించారు. మండలంలోని గ్రామాల్లో గొర్రెలు, మేకల రైతులు ఈ టీకాల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉప సర్పంచ్, వార్డు సభ్యులపై ఫిర్యాదు

శంకర్‌పల్లి: గ్రామ అభివృద్ధికి ఉప సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి సహకరించడం లేదని మాసాని గూడ సర్పంచ్ కొత్తపల్లి రాములు శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి రెండు సంవత్సరాలుగా తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, గ్రామ పంచాయతీ బిల్లులపై సంతకాలు పెట్టడం లేదని తెలిపారు. వార్డు సభ్యుడు చంద్రశేఖర్‌తో గ్రామ కంఠం స్థలాన్ని కబ్జా చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌ని రెండు సంవత్సరాల క్రితం కలెక్టర్ సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. గ్రామ కంఠం స్థలానికి సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికైనా ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి ఉప సర్పంచ్, వార్డు సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విగ్రహ ప్రతిష్ఠ

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, మైహోం అవతార్ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని శ్రీ సంకటహరణ హనుమాన్ దేవాలయం ఆవరణలో చేపట్టిన శ్రీ రాజరాజేశ్వరి మాత విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమైన పూజలు మధ్యాహ్నానికి పూర్తయ్యాయి. దేవాలయ ఆవరణలో ఇప్పటికే ఏర్పాటు చేసిన శివలింగం పక్కనే అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. పూజల అనంతరం నార్సింగి నర్సింగ్‌రావు భజన బృందం భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.

పడకల్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సహకారంతో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. మొక్కజొన్నకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,090 చెల్లిస్తుందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో అలయ్ బలయ్

రాజేంద్రనగర్: దసరా పండుగ సందర్భంగా ముదిరాజ్ మహాసభ రాజేంద్రనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో అలై బలై కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం హిమాయత్‌సాగర్ సొడమ్మ గుట్టపై రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ డి.సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సోదరులంతా సమావేశమై దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ.. ఒకరికొకరు అలై బలై చేసుకున్నారు. అనంతరం ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. కులస్తులంతా ఏక తాటిపై ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరికి మద్దతు ఇవ్వాలనే విషయమై ముమ్మరంగా చర్చించారు. కులస్తులు నియోజకవర్గంలో ఏ పార్టీ నుంచి పోటీ చేసినా.. మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బైరముని మల్లేష్‌ముదిరాజ్, మణికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.నరేందర్‌ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ పెద్దలు ఎం.మహాత్మరావు, కె.నారాయణ, కె.యాదయ్య, ఎం.నర్సింగ్‌రావు, బాలరాజు, రమేష్, ఎం.రాజు ముదిరాజ్, కె.నరసింహ, జి.నర్సింగ్‌రావు తదితరులున్నారు.

నియామకం

యాచారం: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా యాచారం మండలం గునుగల్‌కి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్ నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం ఆ కమిటీ రాష్ట్ర చైర్మన్ మధుయాష్కిగౌడ్ ఉత్తర్వులు జారీచేయడంతో పాటు రామకృష్ణకు నియామకపత్రం అందజేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


జంగయ్యకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి శంకర్


కొత్తూరు: పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన హరినాథ్‌రెడ్డి

- మధురాపూర్, దేవునిబండ తండాల్లో కాంగ్రెస్ ప్రచారం
- సంక్షేమమే లక్ష్యం
- ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు బీఆర్ఎస్ నేతలు మాయమాటలు చెబుతున్నారని, వారిని అసలే నమొద్దని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్, దేవునిబండ తండాల్లో కాంగ్రెస్ అభ్యర్థి, పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్‌ని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటు ద్వార బుద్ధి చెప్పాలన్నారు.

పలు గ్రామాల నాయకులు పార్టీలో చేరికలు..

దేవుని బండతండా, మధురాపూర్ సర్పంచులు మధులత, శివారెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా హాజీపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ఇస్నాతి విష్ణుకుమార్, గుండ్రాది విష్ణు, కోఆప్షన్ సభ్యుడు జంగయ్య, రూప్ సాగర్, పాండురంగం, ఉపేందర్, శివ, రాజేష్, సాయిబాబా, రమేష్, శ్రీకాంత్, తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి వీర్లపల్లి శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బాబర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కి ఓటు వేసి గెలిపించండి

నందిగామ: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌కి ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ, రంగాపూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లోకి చేరారు. రంగాపూర్ గ్రామానికి చెందిన జింకల జంగయ్య తన అనుచరులు సుమారు 50 మందితో వీర్లపల్లి శంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. అవినీతి బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో జంగ నర్సింహా యాదవ్, దేపల్లి కుమార్ గౌడ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, రవీందర్ గౌడ్, జ్ఞానేశ్వర్, నాగేందర్, రాధాకృష్ణ, మనోజ్ రెడ్డి, చందు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

కొత్తూరు: సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాసునాయక్, వెంకటయ్య, లింగనాయక్, కృష్ణ, చెన్నయ్య, ప్రభాకర్‌రెడ్డి, సాబేర్, రేణయ్య, టోని, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై హస్తందే విజయం

మైనార్టీ నేత మహమ్మద్ వాజిద్

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ విజయం ఖాయమని ఇక్కడ పార్టీ జెండాను ఎగురవేస్తామని మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహమ్మద్ వాజిద్ అన్నారు. చేవెళ్లలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భూములను మొత్తం అమ్ముకొని కేసీఆర్ కుటుంబం బాగుపడిందే కాని ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తన కుటుంబానికి రాజకీయ పదవులను ఇచ్చుకున్నాడే కాని నియోజకవర్గంలో ఆయన చేసిందేమిలేదన్నారు. వారి కుటుంబపాలనలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని వాపోయారు. జీఓ 111ను ఎత్తి వేస్తామని ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్ విజయం తథ్యమన్నారు.

రోడ్‌షోను విజయవంతం చేయండి

- హాజరు కానున్న రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,
- భట్టి విక్రమార్క, డీకే శివకుమర్
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్

షాబాద్: రేపు చేవెళ్లలో నిర్వహించబోయే బస్సు యాత్ర, సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎస్. రాంరెడ్డిలతో కలిసి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన 6గంటలకు చేవెళ్లలో రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చేవెళ్లలో నిర్వహించే సభకు షాబాద్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలని వారు కోరారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డికె శివకుమార్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలు ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, చేవెళ్ల నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, మహిళ అధ్యక్షురాలు అశ్విని, బీసీ సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, అశోక్, రవీందర్, అక్తర్‌పాషా పాల్గొన్నారు.


షాబాద్: పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్

కాంగ్రెస్‌తో కరెంట్ కష్టాలు తప్పవు

కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్

కొత్తూరు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులతో పాటు పరిశ్రమల నిర్వాహకులకు కరెంట్ కష్టాలు తప్పవని కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రెప్పపాటు కాలం కూడా కరెంట్ కోతలు విధించలేదని గుర్తు చేశారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి చెల్లిందన్నారు. రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరతో పాటు విక్రయించడానికి అనుకూలంగా మార్కెట్ సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పట్టణాలు మొదలుకొని మారుమూల గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిందన్నారు. మిషన్‌కాకతీయ పథకం ద్వారా ఏళ్ల తరబడి మరమ్మతులు లేక ఉనికిని కోల్పోతున్న చెరువులు, కుంటలకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా మహిళలకు నీటి ఇబ్బందులు లేకుండా మిషన్‌భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలు ఏర్పాటైనట్లు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె సత్యనారాయణ, అజయ్‌నాయక్, మిట్టునాయక్, లింగం నాయక్, శ్రీరాములుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని కోనాయపల్లి, సంతాపూర్, కొత్తపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బీజేపీలో వివిధ పార్టీల నేతలు చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పసుల నర్సింహ్మ యాదవ్, నాయకులు సొప్పరి నర్సింహ్మ, సర్పంచ్ మల్లేశ్, నర్సింహ్మరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇస్నాతి శ్రీనివాస్, ఆకుల ప్రదీప్, నరేందర్ రెడ్డి, లష్కర్ నాయక్, మోహన్‌సింగ్, కుమ్మరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.


కోనాయపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: మహల్ ఎలికట్ట గ్రామంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొందుర్గు మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన ఈసరి శివరాజ్ (35)కు ఫరూఖ్‌నగర్ మండలం మహల్ ఎలికట్ట గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. గత కొంత కాలంగా శివరాజ్ మహల్ ఎలికట్ట గ్రామంలోనే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శివరాజ్ గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివరాజ్ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియరాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దేవాలయంలో చోరీ

షాద్‌నగర్ రూరల్: మండల పరిధిలో ఎలికట్ట గ్రామంలోని అంబ భవానీ మాత దేవాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేశారు. హుండీని బయట పడేసి అందులో ఉన్న నగదును దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

27 లీటర్ల మద్యం స్వాధీనం

మొయినాబాద్: మొయినాబాద్ మండల పరిధిలోని గండిపేట చౌరస్తాలో పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో మద్యం పట్టుకున్నారు. మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో వాహనాల తనిఖీలో భాగంగా ఓ కారులో 27.5 లీటర్ల మద్యం తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గ్యార్మీ పండుగ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ మసీదు కమిటీ అధ్యక్షుడు గౌస్ మైనోద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు కొత్తకోటకు చెందిన మతగురువు హుస్సేన్ ఖాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని మహబూబ్ సుభానీ దర్గా వద్ద గ్యార్మీ జెండాను ఆవిష్కరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఫాతేహాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాసూం, ఖాదర్‌ఖాద్రి, హఫీజ్, నాజర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రత్నంకు ఘన స్వాగతం


మొయినాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే రత్నంకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

మొయినాబాద్: బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన కేఎస్ రత్నంకు శుక్రవారం బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీలో చేరిన తరువాత మొదటిసారిగా మొయినాబాద్‌కు వస్తుండడంతో ఆయనకు కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. ఎమ్మెల్యే యాదయ్యకు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాయకులు బట్టు రాజమల్లేశ్, ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో భూములమ్మినా..

- జిల్లాను అభివృద్ధి చేయని బీఆర్ఎస్ ప్రభుత్వం
- పీఏసీఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

మొయినాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో విలువైన భూములు అమ్మి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, ఉత్తర తెలంగాణ జిల్లాలను అభివృద్ధి చేస్తుందని, జిల్లాలో మాత్రం ఎలాంటి అభివృద్ధి చేయలేదని పీఏసీఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో భూములు అమ్మి లక్షల కోట్ల రూపాయలను సీఎం కేసీఆర్ ఉత్తర తెలంగాణకు ఖర్చు చేశారన్నారు. ఈ విషయంలో జిల్లాలోని మంత్రులు దద్దమ్మల్లా చూస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న ప్రాంతాల్లో రోడ్లన్నీ అధ్వానంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి విలువైన భూములు అమ్మి సీఎం కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఇక్కడ విలువైన భూములు అమ్మి రంగారెడ్డి జిల్లాను కొల్లగొడుతున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

దుద్దాగు రైతులకే పట్టాలు ఇవ్వాలి


రైతులతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా నాయకులు, రైతు సంఘం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి కడిగల్ల భాస్కర్

చేవెళ్ల: దుద్దాగు గ్రామంలో మూడు తరాలనుంచి సాగు చేసుకుంటున్న రైతులకే భూమి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాజీ పీఏసీఎస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. చేవెళ్ల మండలంలోని దుద్దాగు గ్రామంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రైతులు మూడు తరాలనుంచి భూములు సాగు చేసుకుంటూ కబ్జాలో ఉన్నారన్నారు. కానీ కొంత మంది రియల్‌వ్యాపారులు వారిని బెదిరింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గత పాలకులు ఈ రైతులకు పట్టాలు ఇవ్వకుండా మోసం చేశారని ఇప్పుడు ప్రభుత్వం స్పందించి సాగు చేసుకుంటన్న రైతులకు భూమి పట్టాలు ఇవ్వాలన్నారు. లేదంటే సీపీఎం రైతులకు అండగా నిలబడి ఉద్యమిస్తోందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ అల్లి దేవేందర్, తలారం సర్పంచ్ సురేందర్, గ్రామస్తులు, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, పెంటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్

కొందుర్గు: మహదేవ్‌పూర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని జిల్లేడ్ గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంజన్నను గెలిపించుకుంటే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని, మరోసారి అంజన్నకు ఓటువేసి గెలిపించుకుందామని ఓటర్లను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి దేశ ప్రజలంతా ప్రశంసిస్తున్నారన్నారు. మూడోసారి కేసీఆర్‌ను గెలిపించుకొని సీఎం చేయాలని వారు ఇంటింటి ప్రచారంలో ఓటర్లను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కొందుర్గు మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, చౌదరిగూడ మండలఅధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, దామోదర్ రెడ్డి, రాజేష్‌పటేల్, రవీందర్ రెడ్డి, రాజరామేశ్వర్ రెడ్డి, బాబురావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కొందుర్గు: మహదేవ్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గెలిపిస్తే సంక్షేమ పాలన

- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కేశంపేట: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మళ్లీ వైఎస్సార్ సంక్షేమ పాలనను కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షులు వీరేశ్‌అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 8 మంది వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ అబ్బి సుందరయ్యతో పాటు మాజీ సర్పంచ్ శివయ్య మరియు వంద మంది కార్యకర్తలు బీఆర్ఎస్, టీడీపీ పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు మయామాటాలను ప్రజలు నమ్మకపోవడంతో డబ్బు సంచులతో గ్రామాల్లోకి వస్తున్నారని ఆరోపించారు.

నియంతృత్వం భరించలేక..

ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వస్తే తనపై నియంతృత్వం ప్రదర్శించడంతోనే పార్టీ మారినట్టు జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్ రెడ్డి తెలిపారు. పాపిరెడ్డిగూడ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను మంజూరు చేయిస్తే ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు మరో ఇద్దరు తనను అడ్డుకునేవారని ఆదేవన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, బాలరాజ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మంజుల మల్లేశ్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, రూప్లానాయక్, రమేష్, భాస్కర్‌గౌడ్, మనోహర్‌గౌడ్, రాఘవేందర్, దేవేందర్, భిక్షపతి, రవీందర్, యాదగిరి, జాంగారి రవి పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఉప సర్పంచ్ సుందరయ్య